క్లుప్తంగా

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా శత రుద్రాభిషేకం


శత రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం : స్థానిక కోనేటివీధిలోని శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో శనివారం అనంతపురం శ్రీ శివకోటి శ్రీ పీఠం అప్పా స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో స్వామివారికి శత రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, రుద్రహోమము, మన్యుసూక్త హోమములు నిర్వహించారు. అలాగే శ్రీ యంత్రోధారక అభయ ఆంజనేయస్వామి వారికి తేనెతో మన్యసూక్త విధానముగా విశేష అభిషేకము నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి దుస్తులు పంపిణీ

మదనపల్లె సిటీ : చలికి ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలికి మహాకార్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ దుస్తులు అందజేశారు. శనివారం స్థానిక సుభాష్‌రోడ్డులో ఓ వృద్ధురాలు ఇబ్బందులు పడుతుంటే గుర్తించి దుస్తులతో పాటు ఆహారం అందించారు.

నేడు ఏపీఎంఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె సిటీ : పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీఎంఎఫ్ (ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరమ్) జిల్లా నూతన కార్యవర్గాని నఎన్నుకోన్నుట్లు ఆ సంఘ నాయకులు నామా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లాలోని గణిత ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. అరుణ శివ ప్రసాద్ శిష్య బృందంచే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కలకడ : కలకడ హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో శనివారం ఆటో–ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కలకడకు చెందిన ఖాదార్‌బాషా కుమారుడు మస్తాన్ తన ఆటోలో వెళుతుండగా చంద్రగిరికి చెందిన సుబ్రమణ్యం తన ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో ప్రమాదంలో రైతుకు గాయాలు

మదనపల్లె సిటీ : రోడ్డు ప్రమాదంలో రైతు గాయపడిన సంఘటన కురబలకోట మండలం విశ్వం కాలేజీ వద్ద శనివారం చోటు చేసుకుంది. అంగళ్లు పంచాయతీ పెద్దకట్ట వడ్డిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం అంగళ్లుకు వెళ్లాడు. పని పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో విశ్వం కాలేజీ వద్ద ఆటో అడ్డురావడంతో బైక్‌ను తప్పించబోయి కిందపడ్డాడు. గాయపడిన శ్రీనివాసులును స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రతి బిడ్డకూ పౌష్టికాహారం


ప్రసంగిస్తున్న సూపర్‌వైజర్ యశోధరాణి

కలకడ : ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రతి బిడ్డకూ అందజేయాలని సూపర్‌వైజర్ యశోధరాణి సూచించారు. శనివారం మండలంలోని కోన అంగన్‌వాడీ కేంద్రంలో క్లస్టర్ స్థాయి సమావేశం నిర్వహించి గుడిబండ, కోన, నడిమిచెర్ల సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రాలవారిగా హాజరవుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు అందుతున్న పౌష్టికాహార పదార్థాలు ఎండీయూ ఆపరేటర్లు సకాలంలో అందజేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ

- మరో 30 రోజుల్లో ఇంటర్ పరీక్షలు
- సిద్ధమవుతున్న విద్యార్థులు
- ఏర్పాట్లలో ఆర్‌ఐఓ కార్యాలయ అధికారులు

మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యచరణను చేపట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఇంటర్ బోర్డు అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందుకుగాను ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి సెలవుల తర్వాత అధికారులు, అధ్యాపకులు పూర్తి స్థాయిలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

2023–24 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్ పరీక్షలు మార్చి మొదటి తేదీన ప్రారంభమై అదే నెల 20వతేదీ వరకు కొనసాగనున్నాయి. ఉన్న అతి తక్కువ రోజుల్లో విద్యార్థులు పరీక్షల్లో ఎలా మంచి ఫలితాలు సాధించాలని అనే దానిపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. హైసూల్ ప్లస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి ప్రతి రోజూ విద్యార్థులకు ప్రత్యేకంగా నమూనా పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహించి వెనుకబాటు ఉన్న వారిపై దృష్టి సారించారు.


తంబళ్లపల్లె మోడల్‌స్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న అధ్యాపకులు

ప్రత్యేక శ్రద్ధ



ఇంటర్ పరీక్షలు దగ్గరపడటంతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. స్పెషల్ క్లాసులు చెప్పడం వల్ల విద్యార్థుల్లో పురోగతి ఉంది. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు చేపట్టాం. – బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కాలేజీ

ఎన్నికల సమరానికి సిద్ధం

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్
- కార్యకర్తల సమావేశం విజయవంతంపై కృతజ్ఞతలు



మదనపల్లె : ప్రజల అండతో, దేవుడి దయతో రానున్న ఎన్నికల్లో ఒంటరి పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధం అన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపును అనుసరిస్తూ..మదనపల్లె నియోజకవర్గంలో ఎన్నికల సమరానికి తాము సిద్ధమని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం సొసైటీకాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....ఉత్తరాంధ్ర గడ్డ మీద సమర నినాదం..సిద్ధం అంటూ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఐదుకోట్ల ఆంధ్రుల అభిమానాన్ని గెలుచుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. ఇతరుల్లా అబద్ధపు హామీలను, మాయమాటలతో ఎన్నికల రణరంగంలోకి రాకుండా, తన పాలనలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని గుర్తుచేస్తూ, మంచి జరిగి ఉంటేనే తనకు ఓటువేయండని అడుగుతున్నారన్నారు. ఇలా ధైర్యంగా అడిగే దమ్ము, సత్తా కేవలం ప్రజలకు మంచి చేసిన నాయకుడికే ఉంటుందన్నారు. అలాంటి నాయకుడి నాయకత్వంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శుక్రవారం మదనపల్లెలో జరిగిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశానికి కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం విజయవంతానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, ప్రమీలమ్మ, ఎంపీపీలు కుసుమకుమారి, రెడ్డెమ్మవెలుగుచంద్ర, నరసింహులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి, మైనారిటీ కోటాలో మదనపల్లె నియోజకవర్గానికి సమన్వయకర్తగా ఎంపిక చేసిన సీఎం నమ్మకాన్ని నిలుపుకుంటానన్నారు. కార్యకర్తలందరికీ అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

ఇద్దరు నాటు సారా విక్రేతల అరెస్టు

నిమ్మనపల్లె : అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. మదనపల్లె మండలం బొమ్మనచెరువు బత్తినిచెరువుకు చెందిన కుక్కల సుధాకర్ (45) నిమ్మనపల్లె మండలంలోని సామాకోటవారిపల్లె పంచాయతీ, ఎంజి కోట వద్ద నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా రెడ్డివారిపల్లె పంచాయతీ, పాలెం మాదిగపల్లెకు చెందిన అంగజాల శ్రీనివాసులు(26) పాలెం మాదిగపల్లెకు సమీపంలోని నాటు సారాను విక్రయిస్తుండగా అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులపై వేర్వేరు కేసులు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలి

రాజంపేట టౌన్ : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆర్డీఓ రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. కబడ్డీ పోటీల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన స్థానిక ఇంటిగ్రెటెడ్ హాస్టల్ క్రీడాకారులకు శనివారం ఆర్డీఓ కప్, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాజట్టుకు ప్రభుత్వం రూ.35 వేలు నగదు బహుమతిని అందిస్తుందని, విజేతల జట్టుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగదు బహుమతిని వారికి అందే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆడుదా ఆంధ్ర క్రీడాపోటీల రాజంపేట ఇన్‌చార్జి ఎస్.షామీర్‌బాషా, సర్వేయర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తిని వెలికి తీయాలి

నందలూరు(రాజంపేట) : విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అన్నారు. మండలంలోని ఆడపూరు అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో శనివారం ఎస్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తరువాత ఏయే కోర్సులు ఉన్నాయి, అందులో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల సిబ్బంది జడ్జి శంకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కేసులు

కలకడ : ఎరువులు, విత్తనాలు, మందులు అధిక ధరకు విక్రయించినా, రైతులను మోసం చేసినా కేసులు తప్పవని పీలేరు వ్యవసాయ సంచాలకులు వైవి రమణ హెచ్చరించారు. శనివారం మండలంలోని కలకడ టౌన్‌లో ఎరువులు, మందుల దుకాణాలలో రికార్డులు, స్టాక్, ధరల పట్టికలను తనిఖీ చేశారు. ఎరువుల కొనుగోలు చేసిన రైతులకు రసీదు తప్పనిసరిగా అందజేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను మాత్రం అందజేసి అధిక దిగుబడికి మార్గాలు తెలియజేయాలన్నారు. కేవలం లాభాపేక్షతో కాకుండా ఐఎస్‌ఐ ముద్ర కలిగి ప్రభుత్వ అనుమతితో మంజూరు చేయబడిన వాటిని మాత్రమే విక్రయించాలని సూచించారు. తూకాలలో మోసం చేసినా, రైతుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎరువుల బస్తాలు తూకం వేసి పరిశీలించారు. స్టాక్ బోర్డులో ధరలు పేర్కొన్నాలన్నారు .కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి లావణ్య, ఏఈఓ ఇంద్రసేనారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రావన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న వ్యవసాయ సంచాలకులు వైవి రమణ, తదితరులు

త్వరలో కొత్త బస్సులు కొనుగోలు


ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డిని అభినందిస్తున్న డీఎం

మదనపల్లె సిటీ : ఏపీఎస్‌ఆర్టీసీ త్వరలో 1000 ఎలక్ట్రిక్ బస్సులు, 1500 డీజిల్ బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ కార్గో సర్వీసు ఆదాయం పెంచడానికి కార్గో డెవలప్‌మెంట్ కమిటీ నియమించినట్లు తెలిపారు. అన్ని ప్రధాన పట్టణాల్లో పర్యటించి కార్గో ఆదాయం పెంచుటకు మార్గాలను అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. కార్గోలో మంచి ఆదాయం వస్తున్నట్లు పేర్కొన్నారు. 2023 జులై నెలకు ముందు ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న అన్ని క్రమశిక్షణా కేసులు రెండు నెలలలోపు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా రీజనల్, జోనల్ స్థాయి అధికారులకు ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. త్వరలో రిటైర్ అవుతున్న ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించుటకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిపారు.

వరిపంటకు రక్షణగా పాతచీరెలు

గుర్రంకొండ : ఇటివల రైతులు వరిపంటకు రక్షణగా పాతచీరెలను పొలం చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసుకొంటున్నారు. గతంలో టమాటా, వేరుశనగ పంటలకు రక్షణగా పాతచీరెలను ఏర్పాటు చేసకొనేవారు.అయితే ఇటివల రైతులు కొత్తగా వరిపంట చుట్టూ ఏర్పాటు చేయడం గమనార్హాం. వాతావరణ మార్పుల కారణంగా పలు రకాల వైరస్‌లు పంటలను ఆవహిస్తున్నాయి. ఈనేపథ్యంలో వైరస్‌ల బారి నుంచి పంటను కాపాడుకొనేందుకు పలువురు రైతులు ఈ విధానం పాటిస్తున్నట్ల చెబుతున్నారు. తద్వారా పంటకు ఎటువంటి చీడపీడలు సోకవని రైతుల నమ్మకం. వీటితోపాటు అడవి జంతువులు, ఇతర పక్షులు పంటల్ని ఆవహించకుండా చీరెలు ఉపయోగపడతాయంటున్నారు.


గుర్రంకొండలో వరిపంట పొలానికి రక్షణగా ఏర్పాటు చేసిన పాతచీరెలు

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ రాధిక

మదనపల్లె : విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని సైక్రియాటిస్ట్ డాక్టర్ రాధిక తెలిపారు. శనివారం రెడ్డీస్‌కాలనీలోని భాష్యం పాఠశాలలో జరిగిన ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పోర్ట్స్‌మీట్‌లో పుంగనూరు, మదనపల్లె విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, పరుగుపందెం, క్రికెట్, లాంగ్‌జంప్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్.రాధిక మాట్లాడుతూ.... విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. క్రీడల్లో పాల్గొనటం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. దీంతో చదువుల్లో ప్రతిభ చాటడంతో పాటుగా నాయకత్వలక్షణాలు మెరుగుపుతాయన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ షారీబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కవితమ్మ

ములకలచెరువు : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద మహిళలకు తంబళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ శనివారం చీరలు పంపిణీ చేశారు. సుమారుగా 450 మంది మహిళలకు చీరలతోపాటు, పసుపు కుంకుమ, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులు, ప్రజా ప్రతినిధులుగా మహిళలకు ఎక్కువ శాతం అవకాశం కల్పించిన ఘనత ముఖ్యమంత్రిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, అలాగే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సాయి లీల, సర్పంచులు వై. విజయమ్మ, మనోహరమ్మ, ప్రభావతమ్మ, సునీత, జ్యోతి, మంజుల, ఎంపీటీసీలు మహేశ్వరి, ఆయేషా, రేష్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ నంది పురస్కారాలు

పీలేరు : పీలేరు పట్టణానికి చెందిన వివిధ రంగాలకు చెందిన ముగ్గురికి అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నంది పురస్కారాలు లభించాయి. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి నంది, జాతీయ సేవా రత్న అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా పీలేరు పట్టణానికి చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక రంగ కళాకారుడు షేక్ ఖాదర్‌బాషా, కూచిపూడి నృత్య కళాకారిణి హరితా నగేష్, జానపద గాయని, మోటివేటర్ గండికోట ప్రమీలకు నంది పురష్కారాలతో సత్కరించారు. సీనియర్ సినీ నటి పూర్ణిమ రత్నం, సినీ నిర్మాతలు రామసత్యనారాయణ, టీవీ షో ప్రొడ్యూషర్ కపిల్‌దేవ్, లక్ష్మీ సామ్రాజ్యం, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ, నిర్మాత గుర్రపు విజయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేశారు.


నంది పురస్కారం అందుకుంటున్న షేక్ ఖాదర్‌బాషా

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ బి. దస్తగిరి

కురబలకోట : అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేసి సంక్షేమ రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలని ఎంపీపీ బి. దస్తగిరి కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలలో జరిగిన మండల మీట్‌లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చొరవతో నియోజక వర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. సంక్షేమంతో పాటు కొత్త రోడ్ల నిర్మాణం, ముదివేడు రిజర్వాయర్, తాగునీటి పథకం లాంటివి తీసుకు రావడం గొప్ప విషయమన్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో పరివాహన ప్రాంత చెరువులు నిండుతున్నాయన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతున్నాయన్నారు. జగనన్న కాలనీలకు విలువైన పట్టాలు ఇచ్చారన్నారు. సచివాలయాలతో పాలన ప్రజల గడప వద్దకు వచ్చిందన్నారు. నిర్మాణాత్మక అభివృద్ధి జరిగిందన్నారు. తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అసైన్‌మెంట్ భూములను రెగ్యులర్ చేయడం జరిగిందన్నారు. వివిధ రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులతో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఎస్‌ఐ మల్లిఖార్జున రెడ్డి పాటు ఎంపీటీసీ ఎం. ఆనందరెడ్డి, యాసాన్, త్రివేణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో ఎస్‌ఐకి సన్మానం

కురబలకోట : ఉత్తమ ఎస్‌ఐగా పురస్కారం అందుకున్న ముదివేడు ఎస్‌ఐ పి. మల్లికార్జున రెడ్డికి శనివారం జరిగిన మండల మీట్‌లో ఎంపీపీ బి.దస్తగిరితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్‌డే సందర్భంగా జిల్లా ఎస్పీ నుంచి ఇతను ఉత్తమ ఎస్‌ఐగా ప్రశంస పత్రం అందుకున్నారు. ఇటీవలే ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరలో ఆయన లక్కిరెడ్డిపల్లె స్టేషన్ ఎస్‌ఐగా ఉన్నప్పుడు బంగారుషాపులో చోరీ, మోటార్ బైక్‌ల చోరీ, సైబర్ నేరాల విషయంలో పురోగతి సాధించారు. ఈకేసుల్లో ప్రాపర్టీ స్వాధీనంతో పాటు రూ. 6 లక్షలకు పైగా నగదు రికవరీ చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గాను జిల్లా ఎస్పీ ఇతనికి ప్రశంస పురస్కారాన్ని అందజేశారు.


ఎస్‌ఐకి సన్మానినిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆడుదాం ఆంధ్ర కబడ్డీ విజేత పీలేరు


బహుమతులు ప్రదానం చేస్తున్న జీనత్ షఫీ

పీలేరు రూరల్ : ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీల్లో పీలేరు కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీలు హోరా హోరీగా జరిగాయి. కబడ్డీ విభాగంలో పీలేరుజట్టు విన్నర్‌గా నిలిచింది. కలకడ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఖోఖో పోటీలో కలికిరి విన్నర్ కాగా, కలకడ రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ పోటీలో కలికిరి విన్నర్ కాగా, పీలేరు రన్నర్‌గా నిలిచింది. క్రికెట్ పోటీలో గుర్రంకొండ జట్టు విన్నర్ కాగా, కేవీపల్లె జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీలో విన్నర్‌గా కలికిరి, రన్నర్‌గా కేవీపల్లె జట్టు నిలిచాయి. విజేతలకు సర్పంచ్ జీనత్ షఫీ, ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు కాలనీచిన్న, మునీర్, వార్డు మెంబర్ అబీద్, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, సంయుక్త, పీఈటీలు ఎం. నారాయణరెడ్డి, సహదేవరెడ్డి, ఉజ్వలకుమారి, ఉషా, సూర్యప్రకాష్, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే

నిమ్మనపల్లె : కులగణన సర్వేను పారదర్శంగా నిర్వహించాలని డీపీఓ ధనలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని రాచవేటివారిపల్లెలో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. అనంతరం సర్పంచు సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ చలపతిరావుతో కలిసి సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలోని ప్రతి ఇంటికి వెళ్లి, ఇంటిలోని సభ్యులు అనుమతితో వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఎక్కడా తప్పులు దొర్లడానికి వీలులేకుండా అధికారులు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారెప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


కులగణన సర్వేపై అధికారులకు సూచనలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

బ్యాడ్మింటన్‌లో నిమ్మనపల్లెకు తృతీయ స్థానం

నిమ్మనపల్లె : ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీలలో నిమ్మనపల్లె క్రీడాకారులు తృతీయ స్థానం సాధించారని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయిపోటీలలో నిమ్మనపల్లె క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికకావడం జరిగిందన్నారు. మండలం నుంచి అగ్రహారం, నిమ్మనపల్లె–1 బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొని తృతీయ స్థానాలతో సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు.